

# ధర్మలింగీవి

"అమ్మా... గుడ్డివాణ్ణమ్మా..."

"నీకు మా ఇల్లు ఎలా కనపడిందోయ్..."

✤ ✤ ✤

"అమ్మా... చెవిటి వాణ్ణమ్మా..."

"వెళ్ళమని చెయ్యి చూపిస్తుంటే కనపడటంలా..."

✤ ✤ ✤

"అమ్మా కుంటివాణ్ణమ్మా..."

"అంత అవిటివాడివి మా ఇంటిదాకా ఎలా రాగలిగావు...?"

✤ ✤ ✤

"అమ్మా... మూగవాణ్ణమ్మా..."

"నాకు చెముడని చెబుతుంటే వినబడటంలా...?"

✤ ✤ ✤

వచ్చినవాళ్ళందరికీ సమాధానాలు చెప్పి పంపించలేక విసుగుపుట్టిపోతోంది రామారావుకు. వరండాలో కూర్చుని నిశ్చింతగా పుస్తకం చదువుకుందామంటే అవకాశం లేదాయె. ప్రతిక్షణం

ఎవరో ఒకరు రావటం. లేదనిపించుకుని వెళ్ళిపోవటం. అంతమందికి "లేదు" అని చెప్పటానికి గూడా రామారావుకు పూర్తిగా మనస్కరించటం లేదు. పైన తథాస్తుదేవతలుండి ఎవరేదన్నా సరే "తథాస్తు... తథాస్తు!" లు చొప్పున నెలకెన్ని అని లెక్కవేసుకుని చూసుకున్నట్లయితే ఒక్కసారి గుండె గుభేలుమంటుంది. చివరికి ఏమీ లేకుండా పోతుందేమోనని రామారావు బెంగ! అదే కాకుండా ఇలా అబద్ధం చెప్పటంవలన గూడా కొంత పాపం రావచ్చు. మళ్ళీ ఈ పాప నివారణ కోసం కార్యాలు తలపెట్టటం, ఇదంతా చాలా పేచీతో కూడిన పనిలాగా కనిపిస్తోంది.

రామారావు అంత లేని మనిషేం కాదు. పది ఎకరాల మాగాణి భూమి బంగారం పండిస్తుంది. మెట్టభూమిగూడ ఉంది. తిండిగింజలకు వెదుక్కోనక్కర్లేకపోవటమే కాకుండా పదిమందికి తిండిపెట్టగల తాహతు ఉంది. అయితే ఏం... ఉన్నది గదా అని ఊళ్ళోవాళ్ళందరికీ దోచిపెడితే చివరికి తను అప్పులపాలు కావలసివస్తుంది. అదేం బాగాలేదు. పాపమో పుణ్యమో తను చేస్తున్న పనే బాగుంది.

అట్లాగే నడిచిపోతుంటే కథే ఉండేది గాదు.

ఒకరోజున ఒక ముసలి అవ్వ బిచ్చానికి వచ్చింది. నడుం వంగిపోయి చేతికర్ర ముందు, అసలు కాళ్ళు వెనక పెట్టుకుని నడిచి వచ్చింది. ఆ అవ్వను చూచేటప్పటికి పార్వతికి విపరీతంగా జాలి పుట్టుకుని వచ్చింది. రామారావు వెళ్ళమని చెపుతుంటే ఆ అవ్వ వినిపించుకోలేదు. పార్వతీ వినిపించుకోలేదు. మెదలకుండా ఇంట్లోకి పోయి ఒక సోలెడు బియ్యం చాటలో పోసుకుని వచ్చింది. రామారావుకు చిర్రున కోపం వచ్చింది. వాకిలి అంతా వేపచెట్టునీడ పడి గాలికి కదులుతోంది. ముసల్ది మట్టుకు అలాగే నిలబడి పార్వతి రావటం చూస్తోంది.

పార్వతి సరాసరి అవ్వ దగ్గర ఉన్న చెంబులో బియ్యం పోసి, రామారావు వంక చూసింది. రామారావు ముఖం చిట చిటలాడించాడు. అవ్వ వెనక్కి తిరిగిపోతూ 'నీ కడుపు చల్లగా... నీ అమ్మ కడుపు చల్లగా నీ అత్త కడుపు చల్లగా...' అంటూ మొదలుపెట్టి వాళ్ళ బంధుకోటిలో ఉన్న అందరి ఆడవాళ్ళ కడుపులు చల్లగా ఉండాలని దీవించింది. పార్వతి మురిసిపోయింది. ఆనందంతో తన్మయం అయిపోయింది. 'నువ్వు మా ఇంటికి రోజూ రా అవ్వా...' అన్నట్లు చూసింది. అవ్వ దీవెనలో రామారావుకు ఇంకో అర్థం కనపడింది. వాళ్ళందరి కడుపులు చల్లపడి పదిమంది సంతానం కలిగి ఆ ఊళ్ళో పది ఇళ్ళు నిలబడితే, తన పిల్లలు బిచ్చం అడుక్కోవటానికి వీలుగా ఉంటుందనే... ఆ ముసలిదాని ఆశ... అనుకున్నాడు.

అవ్వ వెళ్ళిపోగానే రామారావు "ఏం నువ్వంత ధర్మాత్మురాలివీ... నేను పిసినిగొట్టునీ... అనా నీ ఉద్దేశం...!" అన్నాడు. "అది కాదండీ..." అని పార్వతి ఇంకా ఏదో చెప్పబోయేసరికి రామారావు మళ్ళీ అందుకుని "అది కాదు లేదు... ఇది కాదు లేదు... వెయ్యదలచుకుంటే అందరికీ వెయ్యాలి బిచ్చం, లేకపోతే అందరినీ పంపించెయ్యాలి..." అన్నాడు. "అలాగే చేద్దాం లెండి..." అంది పార్వతి నవ్వుతూ. రామారావుకు వచ్చిన కోపం, ఆవేశం అన్నీ ఆ నవ్వులో కరిగిపోయాయి.

తరువాత ఇంట్లో చాలా తర్జన భర్జనలు జరిగిన తర్వాత ఒక నిర్ణయానికి రాగలిగారు. ఎవరు వచ్చినా సరే బిచ్చం వెయ్యాలి...అని దానిలో ఉండే కష్టసుఖాలు, లాభనష్టాలు, పాపపుణ్యాలు లెక్కలు వేసి మరీ నిర్ణయానికి వచ్చారు. గవర్నమెంటు వారి పుణ్యమా అని

నయాపైసలు వచ్చినాయి గనక అదివరకు అరవైనాలుగు మందిని పంపించడానికి సరిపోయిన మొత్తంతో ఇప్పుడు నూరుమందికి తృప్తికలిగించవచ్చు. వచ్చిన వాళ్ళందరికీ బియ్యం కాకుండా నయాపైసలిస్తే బాగుంటుందని రామారావు సూచించాడు. తీర్మానం ఆమోదింపబడింది.

ఇప్పుడు రామారావు ఇంటికి వచ్చేవాళ్ళు "అమ్మా... బియ్యమెయ్యమ్మ..." అని గాని ఇంకొక విధంగా గాని అరవరు. వాకిట్లో వచ్చి నిలబడతారు. నిలబడలేనివాళ్ళు అరుగుమీద కూర్చుంటారు. రామారావు ఒక పైస తెచ్చి వాళ్ళకివ్వాలి. ఇచ్చిన తర్వాత వెళ్ళమని చెప్పక్కర్లేదు. వాళ్ళంతట వాళ్ళే వెళ్ళిపోతారు. అంతా అలా వెళ్ళిపోతారుగాని యాయవార బ్రాహ్మణుడు మాత్రం వెంటనే వెళ్ళిపోక ఆనాటి తిథి, వార, నక్షత్రాలు చెప్పి మరీ వెళ్ళిపోతాడు. రామారావు వినిపించుకున్ననాడు వినిపించుకుంటాడు, లేనినాడు లేదు. ధారావాహికగా ప్రవహిస్తోంది బిచ్చగాళ్ళ సమూహం. వాళ్ళందరి మనస్సుల్లో ఒక విషయం నిలబడిపోయింది "తమ డబ్బు ఏ జన్మలోనో ఈ అయ్యదగ్గర దాచిపెట్టుకుని ఉంటాం... ఇప్పుడు మళ్ళా మనకి వస్తోంది..." అని. అదివరకు ఎంతో అణకువగా, జాలి ఉట్టిపడే మాటలతో వచ్చేవారంతా, ఇప్పుడు నడుం నిటారుగా ఉంచి, బాకీ వసూలు చేసుకుపోవటానికి వచ్చినవాళ్ళలాగా నిలబడుతున్నారు. రామారావు రూపాయలు చిల్లరగా మార్చటంతో సతమతమవుతున్నాడు. కనీసం రెండు రోజులకొకసారి రూపాయి కాగితం మార్చి పైసలు తీసుకుని రావలసి వస్తోంది. దగ్గరలో చిల్లర దొరకదు. ఈ మధ్య వారానికి ఒకసారి పక్కనే ఉన్న పట్టణపు బ్యాంకులో నుంచి తీసుకువస్తున్నాడు చిల్లర. రామారావుకు ఈ సందర్భంగా చాలా కాలవ్యయం కూడా అవుతోంది. ధనవ్యయంతోపాటు. ఒక వారం చిల్లర తీసుకురావటం మరచిపోయాడు ఇంకేదో పనిమీద. వాకిట్లో జనం గుమిగూడిపోయారు, ఇల్లు కట్టటానికి వచ్చిన కూలీల మాదిరిగా. రామారావు అదృష్టవశాత్తు ఆ రోజు రూపాయి చిల్లర ఒక బిచ్చగాడి దగ్గరనే దొరికింది. నూరు పైసలు లెక్కపెట్టి అరుగుమీద పోశాడు ఆ బిచ్చగాడు రూపాయి కాగితం తీసుకుని. రామారావు కళ్ళు తిరిగినై. పైసలన్నీ తను ఇచ్చినవే అయి ఉండాలి. తన దగ్గర రూపాయి కాగితం తీసుకుని తనిచ్చిన పైసలే మళ్ళా తనకు ఇస్తున్నాడు. ఆ ముష్టి పైసలు తను చేత్తో ముట్టుకోలేదు. వాకిటినిండా బిచ్చగాళ్ళు కిటకిటలాడుతున్నారు. రామారావుకు చాలా చికాకు కలిగింది. ఆ పైసలు తను చేత్తో ముట్టుకోలేదు. అంతా తలొక పైసా తీసుకోండి అని అరిచాడు. వాళ్ళంతా ఒక్కుమ్మడిగా మీదకురికారు. వాళ్ళందరినీ లైనులో నిలబెట్టి ఒక్కొక్కరు తలొక పైసా తీసుకునేటట్లు ఏర్పాటుచేసేసేటప్పటికి తల తిరిగినంత పనయింది. వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోయారు. అక్కడ ఒక్కపైసా కూడా మిగలలేదు. నూరు పైసల్లో వచ్చినవాళ్ళు సుమారు యాభై మంది ఉండవచ్చు. ఛీ! దొంగవెధవలు! అనుకున్నాడు. వాళ్ళందరూ పోగానే వీధి వాకిలి గేటు వేసి లోపలకు వస్తుండగా "మరునాడు బిచ్చానికి పైసలు లేవు..." అన్న విషయం గుర్తుకు వచ్చింది. తను మళ్ళా పట్టణం ఈ పనికోసం పోలేడు. అతనికి ఒక ఆలోచన తట్టింది మళ్ళా ఈ బిచ్చగాళ్ళ దగ్గర చిల్లర తీసుకోవచ్చులే... అనుకున్నాడు.

ఈ సమస్యను ఎలా అంతం చెయ్యటమా? అనేది పెద్ద సమస్య అయి కూర్చుంది. పార్వతితో సంప్రదించాడు ఒకరోజున. పార్వతికి ఏం ఊహలూ తట్టలేదు. "ఏదో ఒకటి ఆలోచించు... లేకపోతే బ్రతకలేం... ఈ ఊరు విడిచిపెట్టవలసి వస్తుంది..." అని హెచ్చరించాడు ఆ రాత్రి

నిద్రకు ఉపక్రమిస్తూ.

ఊరు ఊరు అంతా మ్రోగిపోతూంది రామారావు పేరు. ధర్మలోగిలి, ధర్మాత్ముడు, చెయ్యికి ఎముక లేదు... ఈ మాటలు ఎక్కడ చూచినా వినపడుతున్నాయి. ఈ ప్రచారం ఆ ఊరితో ఆగిపోలేదు. పక్కనే రెండుమూడు మైళ్ళ ఆవరణలో ఉన్న పల్లెలలో కూడా ప్రాకిపోయింది.

"ఊరికే అలా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోకపోతే అయ్యగారింటికిపోయి ఒక పైస తెచ్చుకోగూడదూ..." అనే సాధింపు అనేక పేద కొంపల్లో వినపడుతోంది. రామారావు పేరు ఒకసారి పేపర్లో గూడా పడింది. దానితో పరిస్థితి అదుపు తప్పిపోసాగింది.

ఆ ఊరు ఎలిమెంటరీ స్కూలు వార్షికోత్సవాలు చేసుకుంటోందని, చందాలు కావాలంటూ ఆ స్కూలు హెడ్‌మాస్టరుగారు పదిహేనుమంది పిల్లలను వెంటబెట్టుకుని వచ్చాడు. రామారావుకు మతిపోయినంత పనయింది.

"అబ్బే... నేనేం ఇచ్చుకోగలను...?" అన్నాడు రామారావు బిక్కమొఖం పెట్టి. మనసులో చాలా చికాకు కలిగింది. మాటయితే అన్నాడుగాని ముఖం మాత్రం "మాట మర్యాద కోసం అన్నాను గాని... అసలు చందా ఇస్తాను లెండి..." అన్నట్లు కనపడింది. ఏమిటో ఎవరినీ కాదని కసిరికొట్టలేని ముఖం ఏర్పడింది రామారావుకు. ఇప్పుడు అందుకనే రామారావుకీ ఆయన ముఖానికీ ఈ మధ్య సరిపడటం లేదు.

"అబ్బే... నేనేం ఇచ్చుకోగలను..." అన్నాడు రామారావు మళ్ళీ...

"ధర్మప్రభువులు... మీరు కాదంటే ఇంక ఎవరు ముందుకు వస్తారు చెప్పండి... మొన్న మీ పేరు పేపర్లోగూడా పడింది..." అన్నాడు హెడ్‌మాష్టరు. రామారావు అదిరిపడ్డాడు.

"ఏ పేపర్లో... ఏమని పడిందేమిటి?" అంటూ ఆదుర్దా వెళ్ళబుచ్చి మళ్ళా వెంటనే సర్దుకున్నాడు.

"మీరింకా చూడలేదేమిటి...? నేను వచ్చేటప్పుడు తీసుకునే వచ్చాననుకోండి..." అంటూ కోటు జేబులోనుంచి పేపరు తీసి చూపించాడు. రామారావు ఆ వార్త కోసం పేపరంతా వెతుక్కోకుండా ఉండాలని హెడ్‌మాష్టరు పెన్నుతో ఆ వార్త పడ్డచోట గుర్తుపెట్టి మరీ ఇచ్చాడు. ఆ పెన్ను కక్కింది. చేతికంటిన సిరా తలకు రాసుకుని పెన్ను కంటిన సిరాని అరికాలికి రాశాడు. తరువాత పెన్ను కంటిన మట్టిని ధోవతికి తుడిచేసి పెన్ను జేబులో పెట్టుకున్నాడు. రామారావు ఇదంతా చూడటం లేదు. పేపరు చేతికందటంతోనే ఆ వార్తను పదే పదే చదివాడు. ఈ పేపరు ఎన్నోవేల కాపీలు అచ్చవుతాయి. అంతా చదివి ఉంటారు. బయటకు "ఓహో... పేపర్లో వేశారా?" అన్నట్లు సాధారణమైన ఆశ్చర్యం ప్రకటించినా అతని మనస్సులో ఆనందానికి అంతులేదు. ఆ వార్త పార్వతికి చూపించుదామని మనసులో కలిగింది గాని హెడ్‌మాష్టరుగారి ఎదుట గౌరవంగా ఉండదు.

"సరే నా పేరిట పది రూపాయలు వ్రాసుకోండి..." అన్నాడు రామారావు పేపరు వంక నిర్లక్ష్యంగా చూస్తూ. హెడ్‌మాష్టరు పెన్ను బయటకు తీయటానికి భయపడ్డాడు. మళ్ళా కక్కుతుందో ఏమిటో గొడవ. హెడ్‌మాష్టరు చాలా కృతజ్ఞతలు మనోవాక్కాయ కర్మల ద్వారా ప్రకటించాడు. ఆయనకు పేపరు అడగాలని తోచలేదు. రామారావుకు ఆ పేపరు ఇవ్వాలని అనిపించలేదు. ఆ హెడ్‌మాష్టరుగారు పిల్లలందరిచేత రామారావుకి నమస్కారం పెట్టించి

బయటకు దారితీశాడు. ఈ మాట గూడా పేపరువాళ్ళు వేస్తే బాగుండును అనుకున్నాడు రామారావు.

ఆ పత్రికా వార్త చూసి పార్వతి చాలా సంతోషించింది. తాము గొప్పవాళ్ళం అయ్యాం అని లోకం అంతా అనుకోవాలి. తామే అనుకుంటే గర్వం అవుతుంది. వాళ్ళిద్దరికీ ఆ సంగతి తెలుసు... ఏమనంటే తాము గొప్పవాళ్ళమనీ... ఆ మాట తాము అనుకోగూ... ..ని, "ఏదో మనకు చేతనయిన కృషి, సహాయం మనం చేస్తూ ఉంటే సరి అంతా భగవద్చే" అన్నాడు రామారావు. పార్వతి అవునని అంది. ఆ సంభాషణ అంతటితో సరి.

చందా తీసుకున్న హెడ్‌మాష్టరు మెదలకుండా ఊరుకోలేదు. సహోధ్యాయుల తో చెప్పాడు. వాళ్ళు అంతటితో ఊరుకోలేదు ఇంట్లో వాళ్ళ భార్యలకీ, ఇరుగు పొరుగువాళ్ళకీ చెప్పారు. రామారావు ఇంటికి పొద్దున బిచ్చగాళ్ళు వస్తూనే ఉన్నారు. చందాల కోసం చాలామంది బయలుదేరి వస్తున్నారు. వాళ్ళకి ఒక అంతూ పొంతూ లేదు. ఒక నియమం లేదు. ఊళ్ళో అమ్మవారి జాతర జరుగుతోందనీ, కొత్తగా వెలిసిన వెంకటేశ్వరస్వామివారికి ఆలయం కట్టించబోతున్నామనీ, రాత్రికి గుళ్ళో హరికథ ఏర్పాటుచేస్తున్నామనీ... ఇదంతా ఒక రకం పుణ్యకార్యాల నిమిత్తం చందాల వసూలు జరుగుతున్నాయి.

ఊళ్ళో చెరువు తవ్విస్తున్నామనీ, ఊరి మధ్య అడ్డంకుగా ఉన్న దిగుడు బావి పూడ్చివేస్తున్నామనీ, ఉద్యానవనం ఒకటి ఏర్పాటుచేస్తున్నామనీ, అందులో గ్రంథాలయం, రేడియో ఏర్పాటు జరుగుతున్నాయనీ... అందుకు ఉదారస్వభావులైన రామారావుగారు ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందనీ – ఇదొక రకం.

సామాజికపరంగా కాకుండా వ్యక్తికోసం చందాలు కావాలని వచ్చేవాళ్ళు గూడా ఎక్కువ అయిపోయారు. "ఎవరో తిరపతి పోతున్నారట. ఇంకొక బీదవాడు పెళ్ళి చేసుకుంటాడట. ఎవరో చచ్చిపోయారట... వీళ్ళందరికీ చందాలు కావాలి. రామారావు ఉదారుడు. ఆయన చెయ్యిలో ఎముక లేదు. అంతా ఆ మాట అంటారు. రామారావు కాదనలేదు. చెయ్యిలో ఎముక ఉందని ఎవరినీ మెడపెట్టి బయటకు గెంటలేదు.

ఈ ఉన్న బాదరబందీతో ఇంకొక చిక్కు వచ్చి పడింది. రామారావు విరాళం ఇచ్చినచోట సభ జరిగితే రామారావుని అధ్యక్షుడుగా ఉండవలసిందని ప్రార్థించారు. రామారావు కొంచెం వెనక్కు తగ్గాడుగాని పార్వతి ఊరుకోలేదు. "పదిమంది వచ్చి అడుగుతున్నప్పుడు వాళ్ళని కాదని వాళ్ళ మనసు నొప్పించటం ఏం బాగుంటుంది?" అని ఎదురు ప్రశ్న వేసింది. సభలో తను ముందు వరుసలో కూర్చుంటే తన పక్కనే ఉన్న స్త్రీ ఎవరన్నా "ఏమండీ కుర్చీలో కూర్చుంది మీవారేటగా..." అంటే "అవును..." అని ఎంతో వినయం వొలకపోస్తూ చెప్పవచ్చు. అంత గొప్ప మనిషికి ఎంత వినయమో చూశారా? అని అంతా అనుకుంటారు. అది ఆమె మనసులో మెదిలిన ఊహ. రామారావు సరేనన్నాడు.

ఆ తర్వాత చాలా సభలు జరుగుతున్నాయి. రామారావు చాలావరకు అధ్యక్షపీఠం అలంకరించి సభను శోభాయమానం చేస్తూ వచ్చాడు. దానితో రామారావుకు బొత్తిగా సమయం చిక్కటం లేదు. తన పొలం వ్యవహారం చూసుకోవటానికిగాని, ఇంట్లో పని చూసుకోవటానికిగాని బొత్తిగా సమయం చిక్కటం లేదు.

ఎవరన్నా ఒక మనిషిని తన క్రింద గుమాస్తాగా పెట్టుకుంటే బాగుండును అనుకున్నాడు. అతనికి కొంత జీతం, తనింట్లోనే ఒక గది ఏర్పాటుచేయించాలి. భోజనవసతి గూడా తనింట్లోనే చెయ్యాలి. పార్వతితో సంప్రదిస్తే సరేనన్నది.

ఇంతవరకూ అన్నీ సక్రమంగా జరుగుతునే ఉన్నాయి గాని ఏహో సభలకు పాతిక రూపాయలు ఇస్తానని వాగ్దానం చేసి, తీరా పైకం ఇవ్వటానికి ఇనప్పెట్టె తీస్తే ఖాళీగా కనపడింది. దొంగలు ఎత్తుకుపోయారని కాదు. అంతా హారతి కర్పూరంలా మెల్లిగా హరించిపోయింది. కౌలు రూపేణా వచ్చిన పైకం, సొంత పైకం అంతా అయిపోయింది. సాయంత్రానికి ఆ పాతిక రూపాయిలు ఇవ్వలేకపోతే తన హోదాకు భంగకరం, చాలా నామర్దా అయిన సంగతి. పార్వతితో చెప్పకుండా ఆ ఊళ్ళోనే ఉన్న ఒక సెట్టి దగ్గర అప్పు తీసుకుని వచ్చి సర్దేశాడు. చేతిలో దమ్మిడీ లేదు. మర్నాడు తెల్లవారి బద్ధకంగా లేచాడు. రాత్రంతా ఆలోచనలతో సరియైన నిద్ర పట్టలేదు. "ఇప్పుడేం చెయ్యాలి..." అని అతని మనస్సు ఆవేదన పడింది. అతనికి సమాధానం దొరకనే లేదు. కళ్ళు మండుతున్నాయి. అప్పుడే సూర్యుడు పైకి వచ్చి కిటికీలో నుంచి చురుక్కున చూస్తున్నాడు. మీద కప్పుకున్న దుప్పటి కాళ్ళతో తన్నేసి లేచి కూర్చున్నాడు.

అతను కళ్ళు తెరవటంతోటే మొట్టమొదటగా కనపడ్డ దృశ్యం వాకిటినిండా బిచ్చగాళ్ళు. వాళ్ళు బిచ్చం అడగరు. వేసేటంతవరకూ నిలబడి తరువాత వాళ్ళంతట వాళ్ళే పోతారు. నిన్నటిరోజు పాతిక రూపాయలు తెచ్చినప్పుడు వీళ్ళమాట మనస్సులో స్ఫురించలేదు. కాకపోతే ఇంకో అయిదురూపాయలు ఎక్కువ తీసుకుని వచ్చేవాడే. కళ్ళు నులుముకుంటూ నిద్రకలతలోనే వాకిట్లోకి వచ్చి "ఇవ్వాళ చెయ్యి వీలుగా లేదు... రేపు రండర్రా..." అంటూ గొణిగి లోపలకు వెళ్ళిపోయి ముఖం కడుక్కుని వచ్చాడు. బిచ్చగాళ్ళు అక్కడే ఉన్నారు. రామారావుకు చర్రున కోపం వచ్చింది.

"వెళ్ళమని చెపితే బుద్ధిలేదూ... ఇంకా నిలబడ్డారేం" అన్నాడు విసుగ్గా. "పెట్టనమ్మ పెట్టనే పెట్టదు... పెట్టే అమ్మకు వచ్చింది" అనే సామెత ఆ బిచ్చగాళ్ళకు సామెత తెలియకపోవచ్చు కాని ఆ భావనతోనే నిలబడిపోయారు.

"మీరు కోప్పడితే బతగ్గలమా...?" అన్నాడు ఒకడు అందరి తరపున. రామారావు చెప్పిన అనేకమైన వాదనలు వాళ్ళకి నచ్చలేదు. "నేను వేయదలచుకోలేదు ఇవ్వాళ..." అంతే అన్నాడు రామారావు. తన దగ్గర డబ్బులేదు అని చెప్పటం అతనికి ఇష్టం లేదు. పార్వతిగూడా వచ్చింది ఎన్నో చెప్పింది. వాళ్ళు వినిపించుకోలేదు. అప్పటికే వాకిట్లో పనిలేని పెద్దవాళ్ళు కొంతమంది నిలబడి వింత చూస్తున్నారు. ఇంత అకారణంగా రామారావు మారిపోయాడేమా? అని చాలామంది చూడటానికి వచ్చినవాళ్ళు ఆశ్చర్యపోయారు. రామారావుకి చాలా చిన్నతనం అనిపించింది. ఏమీ చెయ్యలేని దుస్థితిలో ఉన్నాడు. కొంతకాలమయినా ఉంటే మళ్ళీ అప్పుగా తీసుకువచ్చి సర్దవచ్చు. ఆ వీలులేదు. రామారావు మెదడులో మెరుపులా ఒక ఆలోచన తట్టింది.

"మర్నాడు వచ్చినప్పుడు అందరికి రెండు పైసల చొప్పున ఇస్తాననీ ఇవ్వాళ్టికి తనకు వంట్లో బాగాలేదు కాబట్టి అంతా వెళ్ళిపోవలసిందేనని విజ్ఞప్తి చేశాడు. ఆ మాట ఔషధంలాగా పనిచేసింది. పటాలం కదిలింది. వచ్చిన బిచ్చగాళ్ళు మరునాడు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ వెళ్ళిపోయారు. మరునాడు మళ్ళా రాకుండా ఉంటే బాగుండు భగవంతుడా!

అనుకుంటూ రామారావు వీధిగేటు వేసి లోపలకు వచ్చాడు.

భోజనాల సమయంలో పార్వతి అన్నం వడ్డిస్తూ "ఏమండీ... అలా ఉన్నారు?" అని అడిగింది. రామారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగినంత పనయింది. ఉన్న సంగతంతా దాపరికం లేకుండా చెప్పి "ఏం చెయ్యాలో తోచటం లేదు..." అన్నాడు. పార్వతికి అంతకంటే తోచలేదు. ఏం చెయ్యాలి? అనేదానికంటే రామారావు మనసులో ఆవేదన ఏం చేస్తే తగ్గుతుంది? అన్న విషయాలలో పార్వతి ఎక్కువ ఆసక్తి చూపింది.

"ఏదో ఒకటి చేద్దాం లెండీ... మీరు అంత దిగులుపడితే ఎట్లాగు?" అంది. "నా కన్నం సయించటం లేదు..." అంటూ అన్నం తింటూ మధ్యలోనే లేచి వెళ్ళిపోయి చేయి కడుక్కుని వచ్చాడు. పార్వతి అన్నానికి కూర్చోనే లేదు.

వాకిట్లో వరండాలో కుర్చీలో కూర్చున్న రామారావును చూచేటప్పటికి పార్వతి మనసులో ఏదో పాత సంగతి స్మృతిపథంలోకి వచ్చింది. రామారావు దగ్గర విరాళం కోసం మొట్టమొదటగా వచ్చిన హెడ్‌మాష్టరు గుర్తుకు వచ్చాడు. అతను పేపరు ఇచ్చిన సంగతి గుర్తుకువచ్చింది. ఆమె మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. గబగబా వాకిట్లోకి వచ్చి "ఏమండీ! ఒక మాట చెప్పనా..." అంది. "ఏమిటి?" అన్నాడు రామారావు ఎటువంటి ఉత్సాహం చూపకుండా. "ఈ ఊళ్లో ఇన్ని మంచి పనులు జరుగుతున్నాయి... అవన్నీ గూడా అందరి దగ్గరా వసూలుచేసిన చందాలతోనే జరుగుతున్నాయి గదా... మనం చేసే ఈ మంచి పని, అంటే బిచ్చగాళ్ళు అందరికీ అడిగినవాడికి లేదనకుండా ధర్మం చేయటం గూడా చందాలు వసూలు చేసి ఆ డబ్బుతో చెయ్యరాదుటండీ...?" అదీ పార్వతి చెప్పిన మాటల సారాంశం. రామారావు ఉలిక్కిపడి లేచాడు.

"ఏమిటేమిటి మళ్ళీ చెప్పు" అన్నాడు. పార్వతి మళ్ళా చెప్పింది.

"నీ సలహా భేషుగ్గా ఉంది..." అన్నాడు. చాలాసేపు చర్చించుకున్న తర్వాత ఈ బిచ్చగాళ్ళ సమస్య పరిష్కరించటానికి ఒకవిధమైన నిధి ఏర్పాటుచెయ్యాలి అన్న నిర్ణయానికి వచ్చారు. ఆ నిధిపేరు "దరిద్రనారాయణ నిధి" అని నామకరణం చెయ్యటం గూడా జరిగింది.

ఆ రోజు సాయంత్రమే రామారావు ఊళ్లో పెద్దలను చాలామందిని కలుసుకుని ఈ విషయం చర్చించాడు. చాలామంది మెచ్చుకున్నారు, వాళ్ళందరికీ ఊళ్ళో బిచ్చగాళ్ల సమస్య పరిష్కారమవుతుందని. రామారావుకు తన స్వంత సమస్య ఒకటి తీరిపోతుందని. ఆ రాత్రికి ఇంకొక పాతిక రూపాయలు అప్పు తీసుకుని వచ్చి 'దరిద్రనారాయణ నిధి' గురించి సవివరాలను, దాని ఆశయాలను, ఆశయసిద్ధికోసం తను చేయబోతున్న కార్యక్రమాలను సూక్ష్మంగా వివరిస్తూ కరపత్రాలు అచ్చు వేయించటానికి పూనుకున్నాడు. రామారావుకు పొలంపని, వ్యవహారం చూసుకోవటానికి ఒక క్షణం తీరికలేదు. కౌలు ధాన్యం సరిగ్గా రాలేదు దాన్ని గురించి అతను ఎక్కువగా పట్టించుకోలేదుగూడా.

నిధి వసూలు గురించి రామారావు చాలా శ్రమపడి తిరగటం మొదలుపెట్టాడు. ఇస్తామని వాగ్దానం చేసిన కొద్దిమంది నాలుగుసార్లు తిప్పినా పైకం ముట్టచెప్పారు. రామారావు కృషి ఫలితమా అని చేతిలో రెండువందల రూపాయలు మొదటి కొద్దిరోజుల్లోనే పోగయాయి. 'ఆయన చేస్తున్న కృషి నిస్వార్థమైనది, అందుకోసం అంతా తలొక చెయ్యి వెయ్యాలి' అన్న భావన

ప్రతివారిలోనూ కలిగింది. అందుకు తోడు అంతవరకు ఉన్న అతని పలుకుబడి గూడా చాలా విధాలుగా ఉపయోగించింది.

ఇప్పుడు బిచ్చగాళ్ళెవరూ రామారావు ఇంటికి రావటం లేదు. బజారు దగ్గర ఉన్న రావిచెట్టుకిందకు పొద్దున్నే చేరుతారు. రామారావు దగ్గర పనిచేస్తున్న గుమాస్తా అక్కడకే వెళ్ళి అందరికి తలొక పైసా ఇస్తాడు. వాళ్ళందరికి ఏదైనా పని చూపించాలనే ఆలోచన ఇంకా తర్జన భర్జనలో నడుస్తోంది. ఏ రకమైన పని చూపించాలి అన్న విషయంపై ఎటువంటి నిర్ణయం జరగలేదు. అంతవరకు ఇదివరకు మాదిరి తలకొక పైస ఇప్పించే ఏర్పాటు జరిగింది. బిచ్చగాళ్ళు అక్కడ పైస తీసుకుని తరువాత మళ్ళీ ఇంటి ఇంటికీ పోయి అడుక్కుంటున్నారు గాని రామారావు ఇంటికి పోవటం లేదు. రామారావు తమకు రావిచెట్టు దగ్గర ఇప్పిస్తున్నాడని వాళ్ళు అనుకుంటూ వచ్చారు.

నిధి కోసం తిరిగి తిరిగి ఇంటికి వచ్చిన రామారావు సూటిగా వంటింటిలోకి వచ్చాడు. పార్వతి కుంపటి కింద విసురుతోంది. "ఏమిటి... ఇంకా వంట కాలా...?" అని అడిగాడు ఏదో తొందరపని ఉన్నదన్నట్లు.

"ఇంత ఆలస్యంగా వచ్చారేమిటి...? ఇంట్లో బియ్యం నిండుకున్నాయి... ఇందాకటినుంచి మీకోసం ఎదురుచూస్తున్నాను" అంది పార్వతి. రామారావు ముఖం చిన్నబోయింది. "ఇప్పుడు చెబితే ఎక్కడినుంచి తెచ్చేది...? ఈ పూటకి పక్కవాళ్ళ దగ్గరనుంచి తెచ్చి సర్దు..." అని వెంటనే వాకిటి గదిలోకి పోయి లెక్కలు చూసుకుంటూ కూర్చున్నాడు. దరిద్రనారాయణ నిధి ఎంత పోగయిందీ, ఎంత ఖర్చు అయిందీ అన్న లెక్కలు అవీ.

రాత్రికి భోజనాలయిన తర్వాత "రేపయినా బియ్యం ఒక బస్తాడు తెచ్చి పడెయ్యండి... రైతు తెస్తాడని ఎంత కాలమని ఎదురుచూస్తాం...?" అంది పార్వతి మంచం మీద పక్క దులిపి వేస్తూ. రామారావు "అలాగేలే..." అన్నాడు పరధ్యానంగా.

"అలాగేలే... అంటే కాదండీ... రేపు తప్పకుండా తేవాలి..." అంది పార్వతి మళ్ళీ నొక్కి చెపుతూ. రామారావు మనీ పర్సు తెచ్చి చూచుకున్నాడు. ఒక్క రూపాయి కాగితం గూడా లేదు. కొంత చిల్లర ఉంది. అంతే అతని గుండె గుభేలుమన్నది. "బియ్యం దేన్ని పెట్టి కొనాలి...?" "చేతిలో డబ్బేమీ లేదు... ఎలా...?" అంటూ గొణిగాడు అస్పష్టంగా. పార్వతి స్పష్టంగానే విన్నది.

"అంత దగ్గర లేకపోతే ఏం చేస్తాం...? నిధి వసూలు చేశారుగా... దాంట్లోంచి కొనుక్కుని రండి..." అంది పార్వతి. రామారావు ముఖం ఒక్కసారిగా నల్లబడింది. మనసులో ఎన్నో జ్ఞాపకాలు గిర్రున తిరిగాయి. పార్వతికి ఏం సమాధానం చెప్పడానికీ తోచలేదు. "అట్లాగేలే..." ఈ నిధి దరిద్రుల కోసమేగా!" అంటూ గొణుక్కున్నాడు.

(ఋక్మాని - 15 సెప్టెంబర్, 1959)